# అత్తగారూ - అరటిచెట్టూ

బెహరా వెంకట సుబ్బారావు

**ఆ రోజు** మామయ్యగారి తద్దినం. అత్తగారి మనసు మనసులో లేదు. పదిహేను సంవత్సరాల క్రితం పరమపదించిన భర్తను తలచుకొని ఆమె మనసు పాడుచేసుకొందని మీ రనుకొంటే పప్పులో కాలేశా రన్నమాట. ఆమె మనస్తాపానికి అది కాదు కారణం!

మండుటెండలో రెండోసారి బజారు కెళ్ళి వట్టి చేతుల్తో తిరిగొచ్చాడు మా రెండో అబ్బాయి నానాజీ. వైశాఖ మాసం కావడం వల్ల ఉదయం పది గంటలకే ఎండ నిప్పులు చెరుగుతోంది. వాడు తెచ్చిన వార్త విని మరీ చిందులు వేయడం మొదలెట్టారు మా అత్తగారు.

"పెద్ద బజారు కూడా చూశాను, మామ్మా! ఎక్కడా అరిటాకులు అమ్మడం లేదు!" ఉసూరుమంటూ చెమటలు తుడుచుకుంటూ చెప్పాడు నానాజీ.

"నా మాటమీద నీకు నమ్మకం లేదు, మామ్మా! ఎండలో తమ్ముణ్ణి రెండుసార్లు తిప్పావ్." మామ్మగారి మీద చీకాకు పడ్డాడు పెద్దబ్బాయి రాజా. వాడు తెల్లారి లేచి బజారంతా తిరిగొచ్చాడు. పొద్దెక్కాక పల్లెటూర్లనుంచి తెచ్చి అమ్ముతా రని అత్తయ్యగారి ఆశ. మరోసారి వెళ్ళమంటే వాడు మండిపడతాడని రెండో మనమణ్ణి రెండుసార్లు (ట్రిప్పుకి అర్ధ రూపాయ చొప్పున లంచం ఇచ్చి) పంపారు అత్తగారు.

అరిటాకు లేకుండా తద్దినం ఎలా?—ఇదీ అత్తగారి మనసును వికలం చేసిన సమస్య.

"సుగుణా!" మినపప్పు రుబ్బడం ఆపి పిల్చారు అత్తయ్యగారు.

కూరలు తరగడం ఆపి, ఆమెకు దగ్గరగా వెళ్ళి నిలబడి-"చెప్పండి!" అన్నా.

"వర్ధనమ్మగారి పెరట్లో అన్ని చెట్లున్నాయి కదా! రెండాకులైనా దొరక్కపోతాయా? మరోసారి అడుగుతేనో!" అన్నారు ఆశగా.

"ఉదయమే వెళ్ళి అడిగేనండి! నన్నే పెరట్లోకి వెళ్ళి కోసుకోమన్నారు. మూడు చెట్లు గెలలు వేశాయ్! చిన్న చెట్లకి ఆకులు లేవు... మొండిగా ఉన్నాయ్! మూ రెడాకు కూడా లేదు! నేనే స్వయంగా చూశా!" చెప్పాను.

నిరుత్సాహపడ్డారు అత్తగారు.

మా ఇంటి పక్కనే ఉన్న అచ్యుతలక్ష్మిగారి పెరట్లో రెండు బారల పొడవున పెద్ద పెద్ద ఆకుల్తో అరటి చెట్లు కన్పిస్తున్నాయ్. కానీ, ఏం లాభం? ఆమె ఎవరికీ ఇవ్వదు. ఆకు కోస్తే అత్తం తగ్గిపోతుందని ఎవరో చెప్పారట! తమ కే అవసరం వచ్చినా కోసుకోమనీ, బజార్లో కొనుక్కొంటమని ఇదివరలో చాలాసార్లు మాటల సందర్భంలో చెప్పింది. ఆమెను అడిగినా 'ఇవ్వను' అని నిర్మొహమాటంగా చెప్పేస్తుంది. లీడింగ్ లాయరుగారి భార్య నన్న అహంకారమూ, అహంభావమూ ఎక్కువ! ఒకరి లక్ష్యం లేనట్లు మాట్లాడుతుంది.

** ** **

మది సొంత ఇల్లే! అయినా, అరటిచెట్టు వేసుకునే భాగ్యం లేదు. అరటిచెట్టు అచ్చిరాదంటూ పెరట్లో వేయనీయరు అత్తగారు. దాని కో కథ ఉంది(ట). మామగారి ముత్తాతగారి హయాంవరకూ మా పెరళ్ళలో కూడా అరటి మొక్క లుండేవట! ఆ ముసలాయన (అంటే మామగారి ముత్తతగారు- పేరు తెలీదు లెండి) ఓనాడు నిద్ర లేవగానే పెరట్లో ఉన్న అరటిచెట్టు కోటాకు మొహం చూశార్ట! అంతే-ఆ రాత్రి అకస్మాత్తుగా ఏ జబ్బూ లేకుండానే మాట్లాడ్తూనే తన తొంభై మూడవ ఏట (అకాల?) మరణం పొందారట! ఆ క్షణం నుంచీ మావంశంలో ఎవరి పెరట్లోనూ అరటిచెట్టు వేయకూడదనీ, అది అచ్చిరాదనీ తీర్మానించారట! ఆ తీర్మానం ఆచారమై కూర్చుంది. మాఇంటి పేరుగల వా రెవరి పెరళ్ళలోనూ అరటిచెట్లు డవ్...

అయితే ఆ మధ్య... అంటే ఆర్నెల్ల క్రితం మా చిన్న మామగారు కూతురికి పెళ్ళి చేశారు రాజమండ్రిలో. ఆయన అక్కడ స్టేట్ బాంక్‌లో ఆఫీసరు. రెండు సంవత్సరాల క్రితం దానవాయిపేటలో ఓ ఇల్లు కొని రీ మోడల్ చేశారు. రెండంతస్తుల మేడ కట్టారు. వారి ముగ్గురబ్బాయిలూ మంచి ఉద్యోగాలే చేస్తున్నారు. ఒకడు ఇంజనీరు. రెండోవాడు డాక్టరు. మూ డోవాని కీ మధ్యనే లెక్చరర్ ఉద్యోగం వచ్చింది రాజమండ్రిలోనే. పెద్దమ్మాయిని డాక్టరు కిచ్చి పెళ్ళి చేశారు. రెండో అల్లుడు ఇంజనీరు. ఆ రెండో అమ్మాయి పెళ్ళికి రాజమండ్రి వెళ్ళాం. ఆయన ఇల్లు కట్టాక మేం వెళ్ళడం అదే మొదటిసారి.

పెళ్ళి పెద్దయెత్తున చాలా ఘనంగా చేశారు. వీథిలో పెద్ద పందిరి వేశారు. మామిడాకుల తోరణాలు విచిత్ర రీతిలో అందంగా కట్టబడి ఉన్నాయ్. ప్రతి పందిరి రాటకీ గెలలతో ఉన్న అరటి చెట్లను కట్టారు. ఆపైన రంగు రంగుల, రకరకాల విద్యుద్దీపాలు విచిత్రమైన విన్యాసాలూ చేస్తూ చూపరులను ఆశ్చర్యచకితుల్ని చేస్తున్నాయ్.

మా పిన్నత్తగారు తోటికోడలకి ఇల్లంతా చూపించారు. పెరట్లో పెద్ద కాళీ జాగా ఉంది. అక్కడ అరటితోట ఉంది. కనీసం ముప్పై చెట్లన్నా ఉంటాయ్. చాలా చెట్లు గెలలు వేశాయ్. ఎంతో





శోభాయమానంగా లక్ష్మి కళ ఉట్టిపడ్తూ ఉంది.

అత్తగార్ని పక్కకి పిల్చి నెమ్మదిగా అన్నా- "మనకి అరటిచెట్టు అచ్చిరా దన్నారు! వీరి పెరట్లో ఎంత పెద్ద తోట ఉందో చూడండి! ఏ అరిష్టమూ మూ డలేదు సరికదా... సంసారం ఎలా పొంగుకొస్తోందో! ఈ ఇల్లు కొన్నాక మామయ్యగార్కి ఆఫీసరుగా ప్రమోషన్ వచ్చింది. పెద్దబ్బాయికి ముగ్గు రాడపిల్లల తర్వాత మగపిల్లాడు పుట్టాడు. అబ్బాయిక్కూడా అ 'సి స్టెంట్ ఇంజనీరుగా ప్రమోషన్ వచ్చింది. ఆఖ రబ్బాయికి లెక్చరర్ ఉద్యోగం లభించింది! అమ్మాయికి పెద్ద సంబంధం కుదిరింది!" ఆ ఇల్లు కొన్నాక ఆ ఇంట్లో జరిగిన శుభకార్యాలనీ, శుభపరిణామాలనీ ఏకరవు పెట్టాను. మా ఇంట్లో కూడా అరటితోట వేయడానికి అత్తగారిని అంగీకరింపజేయాలని నా ప్రయత్నం.

అత్తయ్యగారు సమాధానం చెప్పలేదు. ఆ అరటితోపు వైపు చూస్తూ ఉండిపోయారు.

పెళ్ళి హడావిడి అయాక అంతా తీరిగ్గా కూర్చున్నాం ఓ అరగంట సేపు.

తోటి కోడల్ని అడిగారు మా అత్తయ్యగారు. నేను ప్రక్కనే ఉన్నా. "ఏవేఁ విజయా! అరటి తోట మరిదిగారే వేయించారా?"

"లే దక్కయ్యా. మే మీ ఇల్లు కొన్నప్పుడే నాలుగైదు మొక్క లుండేవి! వాటికి నీళ్ళూ పాలూ ఏదీ పోయాల్సిన అవసరం లేదు కనుక అలా ఉంచేశాం. అన్ని విధాలా పనికొస్తాయని! అవే పెరిగి పెద్ద తోటయింది." "మరి, మనకి అరటిచెట్టు అచ్చిరాదని అంటారు కదండీ!"

మనసులోని శంకను బయటపెట్టా నివృత్తికనం.

ఆమె ఠక్కున సమాధానం చెప్పారు. "అది నిజవేఁ నమ్మా! మనం పెరట్లో వేసుకోకూడదు. వాటంతట అవి లే స్తే ఫరవాలేదు!" ఎమెండ్మెం టిచ్చారు.

వాటికి స్వతహాగా బీజవ్యాప్తి గుణం లేదు కాబట్టి వాటంతట అవి మొలిచే ప్రశ్నే లేదు. దుంపైనా పాతాలి. మొక్కయినా నాటాలి. ఆ విషయం ఇంకా చర్చించడం బావుండదని ఊరుకొన్నా.

** ** **

అంతలో మా పక్కిం టిల్లాలూ, అరటితోట యజమానీ అయిన అచ్యుతలక్ష్మి పాల సంద్రంనుంచీ ప్రభవించిన మోహినిదేవిలా వచ్చి సాక్షాత్కరించింది. వాళ్ళ భవనంలో కరెంటు పోయిందట. మాక్కూడా పోయిందో, లేదో అని విచారించడానికి వచ్చానని చెప్పింది.

అచ్యుతలక్ష్మిగారిని చూశాక అత్తగారికి పోయిన ప్రాణం లేచి వచ్చింది. అవసరం చాలా గట్టిది కాబట్టి 'సిగ్గూ బిడియవూఁ విడిచి అడిగారు: "అరిటాకులు దొరక లేదమ్మా! తద్దినానికి చాలా ముఖ్యం... కనీసం మూ డాకులైనా కావాలి."

"అలాగా! పావు గంటలో మా పాలేరు చేత పంపిస్తా లెండి!" అని చెప్పి, మమ్ముల నందర్నీ ఆశ్చర్యాంబుధిలో ముంచి నిష్క్రమించింది అచ్యుతలక్ష్మి.

తేలిక పడిన మనసుతో ఆనందార్ణవంలో మునిగి తేలియాడ్తూన్న అత్తయ్యగారు పప్పు రుబ్బడం మరిచిపోయి ఆ అభయప్రదాయిని అచ్యు

తలక్ష్మి అంతర్ధానం అయిన వైపే చూస్తూ ఉండిపోయాడు.

"అత్తయ్యగారూ!" పిలిచా.

నా పిలుపుతో ఈ లోకంలోకి వచ్చిన అత్తయ్యగారు తిరిగి పప్పు రుబ్బడం మొదలుపెట్టారు. "అవసరం చెబితే ఎంత పిసినారైనా తప్పకుండా ఇస్తుందమ్మా! పోనీలే... ఆ మూడుంటితోనూ ఎలాగో సర్దుకొందాం!" తృప్తి పడ్డారు.

టైము పదకొండు గంటలు కావస్తోంది. పెద్ద మార్కెట్టుకి వెళ్ళి నేతి సీసాతో తిరిగొచ్చారు మా వారు.

సేయి అందుకొంటూ చెప్పా- "అరిటాకులు ఎక్కడా దొరకలేదండి!"

"ఈ గాలి వానకి అరటితోటలన్నీ విరిగిపోయాయిట. బజార్లో నేనూ చూశా! ఏం చేద్దాం?" తిరిగి నన్నే అడిగారు.

"అచ్యుతలక్ష్మిగార్ని మీ అమ్మగారు అడిగారు!" అన్నా.

"ఇస్తానందా?" అడిగారు.

"ఆఁ...ఏ కళనుందో మరి! పంపిస్తానని చెప్పింది!"

"హమ్మయ్య!" అంటూ కుర్చీలో కూలబడ్డారు.

మరో అరగంట గడిచింది. అచ్యుతలక్ష్మి గారి పనివాడు అప్పన్న వచ్చాడు వట్టి చేతుల్తో.

"బజారంతా తిరిగా నమ్మగారూ! ఎక్కడా అరిటాకులు దొరకలేదు! ఈ యినయం మీతో చెప్పమన్నారు మా యమ్మగారు!" చల్లగా చెప్పాడు.

వాడు తెచ్చిన వార్త విని నిర్ఘాంతపోయారు అత్తగారు.

ఆవిడ-'పంపిస్తానంటే' ఆకులు పంపడం కాదన్న మాట! బజారుకి మనిషిని పంపించడమని అప్పుడు అర్థమైంది. ఆ మాటల్లోని ఉన్న మర్మాన్ని ఆలస్యంగా గ్రహించాం.

"పోనీలేమ్మా! అడ్డాకు విస్తళ్ళున్నాయ్! వాటినే వాడుకొందాం!" అన్నారు మా వారు.

"శాస్త్రం ఒప్పుకోదురా! అరిటాకుతోనే దొన్నెలు చేయాలి! అరిటాకు మీదనే పిండా లుంచాలి! పితృ కార్యానికి అరిటాకులు అత్యంత అవసరం. కానీ, మరేం చేస్తాం. ఈ పదిహేను సంవత్సరాల్లోనూ అరిటాకు లేకుండా తద్దినం పెట్టలేదు!" విచారాన్ని వ్యక్తం చేశారు అత్తయ్యగారు.

పన్నెండు గంటలు సమీపిస్తూంటే ఇద్దరు భోక్తల్ని తీసుకొని వచ్చారు అష్టావధానిగారు. ఆయన అన్న టైమ్‌కి సరిగా వస్తారు. వచ్చిన తర్వాత ఆగరు. అందుకే పదకొండున్నర గంటలకే మేము రెడీ అయాం.

రాగానే పెరట్లోకి వెళ్ళి ముగ్గురూ స్నానాలు చేశారు. పీట వేసుకుని దర్భలు ముందు పెట్టుకుని కూర్చున్నారు అష్టావధానిగారు.

"సుగుణమ్మా! అరిటాకులు వడెయ్... దొన్నెలు చేయాలి!" కేకేశారు.

"అరిటాకులు ఎక్కడా దొరకలేదండి! అందుకే అత్తగారు చాలా బాధ పడుతున్నారు..." చెప్పాను.

"అలాగా! మా ఇంటికి మీ పెద్దబ్బాయిని పంపండి... నాలుగాకులు ఇస్తుంది!"

అవధానిగారి ఆ మాటలు విన్నాక అత్తగారు తెప్పరిల్లారు.

"అబ్బా! ద్వారకా నగరం వెళ్ళాలి! రానూ పోనూ ఆరు మైళ్ళు! ఎండలో సైకిల్‌మీద వెళ్ళలేను. సిటీ బస్సుకి రెండు రూపాయలు అవుతాయ్!" పేచీ పెట్టాడు పెద్దబ్బాయి రాజా.

"రెండు కాకపోతే అయిదు తీసుకో. బాబూ! అర్జంటుగా ఆకులు తెచ్చి పెట్టు!" అంటూ పోపుల డబ్బాలో ఉన్న అయిదు రూపాయల నోటుని మనవడి ముందు పడేశారు అత్తగారు.

రాజా బయలుదేరబోతుంటే వెనక్కి పిలిచారు అష్టావధానిగారు. తన చేతికున్న రిస్టు వాచీని తీసి రాజాకి అందించారు. "ఈ వాచీని మా ఆవిడ కిచ్చి నాలుగాకు లివ్వమన్నానని చెప్పు!" అన్నారు.

"వాచీ మీ ఆవిడగారిదాండి?" అమాయకంగా అడిగాడు రాజా.

సమాధానంగా చిరునవ్వు నవ్వి, "మా ఆవిడ అయిదు రూపాయలు అప్పు ఇమ్మన్నా ఇస్తుంది కానీ, అయిదంగుళాల అరిటాకు ముక్క ఇమ్మంటే ఇవ్వరు! ఆ సంగతి నీకు తెలీదు. వెళ్ళు... వెంటనే రా!" వివరంగా చెప్పారు.

"పావుగంటలో రావాలి!" అన్న నా కేకను వినిపించుకోలేదు రాజా. సైకి లెక్కి తుర్రుమన్నాడు. సరిగ్గా సలబై నిమిషాల తరవాత నాలుగాకులు తెచ్చి పడేశాడు రాజా. ఆకులు చూశాక మా అందరి మొహాలూ విప్పారాయ్. అత్తగారి ఆనందానికి హద్దు లేవు.

ఆకులు కట్ట విప్పాను. రెండాకులకి చిగుళ్ళు



చింకి చింకిలుగా ఉన్నాయ్.

"ఆకులు చిరిగిపోయే యేవిరా?" అడిగా కోపంగా. ఆ ఇల్లాలు చింకాకులు ఇచ్చిందని అవధాని గారికి తెలియ జేయాలని నా ఉద్దేశం.

"మంచివే ఇచ్చేరమ్మా! దారిలో ఫ్రెండు కనబడితే సైకిలు దిగి వాడితో మాట్లాడుతున్నా" అని నసిగాడు.

"వాడు చింపేశాడా?" భగ్గుమన్నారు అత్తగారు.

"లేదు, మామ్మా! వెనకనుంచి ఆవొచ్చి ఆకుల్ని తినేయబోయింది... దాని నోట్లోంచి లాగాను! రెండాకులు చిగుళ్ళు చిరిగి పోయాయ్!" భయపడ్తూ నెమ్మదిగా చెప్పాడు.

"అవే కదా... ఫరవాలేదు! కడిగి వేగంగా తీసుకురా!" సర్ది చెప్పి తొందర చేశారు అవధానిగారు.

********

పది రోజులు గడిచాయ్. ఆ రోజు ఉదయం పళ్ళు తోముకొంటూ పెరట్లో అటూ ఇటూ పచార్లు చేస్తున్న నానాజీ గట్టిగా కేక వేశాడు. అమ్మా అన్నాడో, మామ్మా అని పిలిచాడో సరిగా అర్థం కాలేదు. గట్టిగా ఉంది కేక. ఏ పామో కనిపించి ఉంటుందన్న భయం వేసింది. నీళ్ళు తోడ్తూన్న బాల్చీని గిలక మీదనే వదిలేశా. ఇంట్లో ఉన్న ఆయనగార్ని రమ్మని కేకేసి, నానాజీ దగ్గరికి పరుగు దీశా. నందివర్ధనం పూలు కోస్తూన్న అత్తయ్యగారు నా కన్నా ముందుగానే నానాజీ దగ్గరికి వెళ్ళారు.

"ఏంరా! ఏమైంది?" కంగారుగా మనవణ్ని అడిగారు.

వాడు ప్రహరీగోడకి బారెడు దూరంలో ఉన్న సన్నజాజి మొక్క మొదలు వైపు వేలుతో చూపించాడు. ఇద్దరమూ అటు చూశాం.

"ఒరే రాజా, సీతారావుడూ! ఓ సారిలా రండిరా!" కేక వేయడం అత్తయ్యగారి వంతైంది. ఒక్క నిమిషం ఆగి, ఆ తండ్రీ కొడుకు లిద్దరూ రాకపోవడంతో ఆలస్యాన్ని భరించలేక మరో కేక వేశారు. "అర్జంటుగా రండి! ఏం చేస్తున్నార్రా లోపల?"

సగం సగం గెడ్డాం షేవ్ చేసుకుంటూ, చేతిలో రేజర్‌తో పరుగున వచ్చారు ఆయన. ఆ వెనుకనే వచ్చాడు రాజా, చేతిలో పెన్ను డొక్కుల్తో (సిరా పోసుకుంటున్నాడు కాబోలు పాపం!). చేతిలో సిరా! బట్టలమీద సిరా! వారిద్దర్నీ చూశాక నాకు నవ్వాగింది కాదు. పకాలన్న నవ్వేశా. సన్నజాజి మొక్క మొదలు చూపిస్తూ, "అటు చూడండి!" అన్నారు అత్తగారు. ఆమె మొహంలో ఆనందం చిందులు వేస్తోంది.

"ఓసి అదా! కొంప మునిగినట్లు పిల్చావ్. బట్టలనిండా సిరా ఒలికి పోయింది!" మామ్మగారి మీద చీకాకు పడ్తూ తిరిగి వెళ్ళాడు రాజా. మా శ్రీవారి మొహంలోకి-చూశా వారి భావం ఎలా ఉంటుందోనని. ఆయన తన గెడ్డాన్ని చూపించాడు. బ్లేడు చెక్కుకు పోయి రక్తం చిమ్ముతోంది. ఆయన వాలకం చూసి మరోసారి గలగలా నవ్వేశా.

"ఆనక దొడ్డి తుడిచే రావు లొస్తాడు! పీకి అవతల పారేయ్‌మను!" పురమాయించి తిరిగి వెళ్ళారు శ్రీవారు.

వారి మాటలకి మాఅత్తగారు నిరుత్సాహ పడలేదు. ఆమెలో ఆనందం ఏ మాత్రపూ తగ్గలేదు. "దానంతటదే అది పెరట్లో వేస్తే శుభసూచక ! జాగ్రత్తగా, శ్రద్ధగా పెంచి పెద్ద చేయాలి!" అంటూ పూలు కోయడం మరిచి, ఆ అరటి మొలక చుట్టూ పాడి కట్టారు. బిందెడు నీళ్ళు తోడి తెచ్చి పోశారు.

వారం తిరిగేసరికి మా వారికి సూపరింటెండంటుగా ప్రమోషన్ వచ్చింది. మరో పది రోజులకి మా పెద్దబ్బాయికి పోలిటెక్నిక్‌లో సీటు లభించింది.

"నే చెప్పాను కదమ్మా పెరట్లో అరటి మొక్క ఉంటే ఆ ఇంటిలో లక్ష్మి తిష్ఠ వేసుకుంటుందని!" అన్న అత్తగారి మాటలకి ఆశ్చర్యం వేసింది.

"మరి అరటిచెట్టు మనకి అచ్చిరాదని అన్నారు కదండీ!" నవ్వాపుకొంటూ రెట్టించాను.

"మనం వేసుకో కూడదమ్మా!" తమ విశ్వాసాన్ని, అభిప్రాయాన్నీ వదల్లేదు అత్తయ్యగారు.

అత్తగారి ప్రత్యేక పోషణలో ఆ అరటి మొక్క దినదినాభివృద్ధి చెందింది. దాని సంతానోత్పత్తిని చూసి మురిసిపోయేవారు. నెలలు గడుస్తున్నాయ్. పెద్ద చెట్టు గెల వేసింది. దాని చుట్టూ పుట్టిన మొక్కలుకూడా పెద్దవయ్యాయ్. పెద్ద పెద్ద ఆకులు వేస్తున్నాయ్.

ఆ రోజు మధ్యాహ్నం ఎదురింట్లో ఉన్న రామలక్ష్మి వచ్చింది. కూడా ఆమె పెద్ద కొడుకుని తీసుకొచ్చింది. వాడు మా నానాజీ ఈడువాడు. ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. రామలక్ష్మి తన కూతుర్ని పురిటికి తీసుకొచ్చింది. అప్పుడప్పుడు మా ఇంటికి వస్తుంది కబుర్లు చెప్పుకోవడానికి.

"కూతురికి ఏ ఏ పిండి వంటలు చేసి పెట్టావమ్మా?" అడిగారు అత్తయ్యగారు యాధాలాపంగా.

"చాలా రకాలు చేశాను, పిన్నిగారూ, ఒక్క బొబ్బట్లు తప్ప! అవి రేపు చేద్దామనుకుంటున్నా! అందుకోసమే వచ్చా! బొబ్బట్లు చరచుకోవడానికి అరిటాకు ముక్క కావాలి!" వచ్చిన పని తెలియజేసింది రామలక్ష్మి, మా ఇద్దరి వైపు చూస్తూ.

నే నేమీ సమాధానం చెప్పలేదు. ఆ అరటిచెట్ల మీద నాకు అధికారం లేదు.

"దానికేం ఉందమ్మా! ఓ ఆకు కోసుకొని వెళ్ళు!" చెవులతో వింటున్నా, అత్తగారు ఆ మాటన్నారంటే నమ్మశక్యం కాలేదు.. ఆవిడగారి ఔదార్యానికి అచ్చెరువొందా.

"ఒరే గోపీ! నువ్వూ, నానాజీ వెళ్ళి ఓ అరిటాకు కోసుకు రండి!" రామలక్ష్మి గారబ్బాయిని అత్తయ్యగారే ఆజ్ఞాపించారు.

వారిద్దరూ పెరట్లోకి వెళ్ళి పది నిమిషాలు పోయాక తిరిగి వచ్చారు.

"ఎక్కడా జానెడు ఆకుకూడా లేదు, మామ్మగారూ! అన్నీ చిరిగి పోయాయ్!" చెప్పాడు గోపీ కత్తిపీటను కింద పారేస్తూ. రామలక్ష్మి నిరుత్సాహ పడింది.

"ఈ గాలికి ఆకులు చిరిగి పోతున్నాయమ్మా!" సంజాయిషీ ఇస్తూ విచారాన్ని వ్యక్తం చేశారు అత్తయ్యగారు.

అసలు సంగతేమిటో నాకు తెలుసు. అత్తగారు ఉదయం లేవగానే అరటిమొక్కను సందర్శిస్తారు. ఆ తరవాతే మిగిలిన పనులు. ఆకులు బాగా విడగానే బెత్తెడు ముక్కకూడా వదలకుండా పనిగట్టుకు చీల్చుతారు. ఆ కార్యక్రమంలో నానాజీ సాయం చేస్తాడు- అందినంత వరకు ఆవిడ చీరుతూ, అందనిని గోడెక్కి వాడు చీరేస్తాడు-ఆవిడ ఆజ్ఞ ప్రకారం. ★

